


రాయ 'బేరాలు'

- ముద్రగడతో వైసీపీ నేతల మంతనాలు
- తనయుడికి త్వరలో కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవి
- ఎన్నికల తర్వాత కుదిరితే ముద్రగడకు రాజ్యసభ పదవి ఆఫర్
- పిఠాపురం సీటుపై పట్టుబట్టినా నిరాకరించిన వైసీపీ అధిష్ఠానం
- టీడీపీ, జనసేన తలుపులు మూసేయడంతో వైసీపీలోకి ఓకే
- ఈనెల 14-17వ తేదీల మధ్య జగన్ సమక్షంలో కండువా
- ఇటీవల వైసీపీ తనను అవమానించడంపై ముద్రగడ గుర్రు
- ఇప్పుడు తిరిగి మళ్లీ అదే పార్టీలోకి వెళ్లేందుకు రెడీ
- అటు పిఠాపురం నుంచి బరిలో కొనసాగనున్న వంగా గీత

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాపు ఉద్యమ నేత ముద్రగడతో వైసీపీ బేరాలు కొలిక్కి వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డ నేపథ్యంలో రాజకీయంగా ఎంతోకొంత ఉపయోగపడతారనే కోణంలో ఆయన్ను పార్టీలో చేర్చుకునేందుకు అధికార పార్టీ సిద్ధమైంది. వైసీపీ తీరుపై ముద్రగడ తీవ్ర ఆగ్రహంతో ఇటీవల ఆ పార్టీకి దూరం జరిగారు. ఆ తర్వాత టీడీపీ, జనసేనలో చేరడానికి ప్రయత్నించారు. కానీ రెండు పార్టీల నుంచీ తలుపులు మూసుకుపోవడంతో తిరిగి మళ్లీ ఫ్యాను కిందకే వెళ్లడానికి దాదాపు నిర్ణయించారు. ఈమేరకు పార్టీ జిల్లా పరిశీలకుడు మిథున్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు గురువారం కిర్లంపూడిలో ముద్రగడతో నిర్వహించిన భేటీలో రాయబేరాలు ఫలించాయి. బయటకు భేషరతుగా వైసీపీలోకి చేరడానికి ముద్రగడ అంగీకరించారని చెబుతున్నా ఇరువర్గాల మధ్య కొన్నిరోజులుగా పలు కీలక అంశాలపై మాటలు జరిగాయి. అందులో భాగంగా పిఠాపురం అసెంబ్లీ సీటుపై ముద్రగడ కుటుంబానికి ఆసక్తి ఉండడంతో అక్కడి నుంచి పవన్‌పై ముద్రగడను బరిలోకి దించితే బాగుంటుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి ఇటీవల జగన్ వద్ద ప్రతిపాదించారు. కానీ జగన్ మాత్రం సుముఖత వ్యక్తం చేయలేదు. పిఠాపురం బదులు ముద్రగడ తనయుడికి జగ్గంపేట సీటు ఇవ్వడానికి కొంతవరకు అంగీకారం తెలిపారు. కానీ ఈ ప్రతిపాదనపై ముద్రగడ సుముఖత చూపలేదు. ఈనేపథ్యంలో మళ్లీ ద్వారంపూడి, ముద్రగడ మధ్య చర్చలు జరగ్గా, భవిష్యత్తులో రాజ్యసభ సీటు ఇవ్వడానికి పార్టీ అంగీకరించిన విషయాన్ని ముద్రగడకు వివరించారు. ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు పలు జిల్లాల్లో ప్రచారం కూడా చేయాలని ముద్రగడ ఎదుట ప్రతిపాదించారు. అయితే పిఠాపురం సీటు ఇచ్చే పరిస్థితి లేదని తేలినా


ముద్రగడ నివాసంలో మంతనాలు జరుపుతున్న వైసీపీ నేతలు

మరో మార్గం లేక వైసీపీలో చేరడానికి కొన్ని రోజుల కిందట ముద్రగడ సూచనప్రాయ అంగీకారం తెలిపారు. ఈనేపథ్యంలో ముద్రగడ పచ్చ జెండా ఊపడంతో గురువారం మిథున్‌రెడ్డిసహా ఎమ్మెల్యేలు, ఎంపీ గీతా ఆయన నివాసానికి వచ్చారు. గత కొన్ని రోజులుగా ఫోన్లలో జరిగిన సంభాషణలు, పార్టీ అధిష్ఠానం చెప్పిన విషయాలపై ముద్రగడతో వీరంతా చర్చలు జరిపారు. అయితే పిఠాపురం నుంచి పవన్ బరిలోకి దిగుతున్న నేపథ్యంలో ముద్రగడ పేరును తాము ప్రతిపాదించినా అధిష్ఠానం సుముఖత వ్యక్తం చేయని నేతలు ముద్రగడతో చర్చించారు. ఈ క్రమంలో టికెట్ బదులు ముద్రగడ తనయుడికి కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చే అంశంపై ఒకరిద్దరు నేతలు ప్రస్తావించినట్టు సమాచారం. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈపదవితో పెద్దగా ఉపయోగం లేదని తెలిసినా కార్పొరేషన్ చైర్మన్‌గా కొద్దిరోజులైనా చేసిన హోదా ఉంటుందని ముద్రగడ ఎదుట వీరంతా ప్రస్తావించినట్టు తెలిసింది. అలాగే వైసీపీ ఒకవేళ అధికారంలోకి వస్తే రాజ్యసభ సీటు ఇవ్వడానికి పార్టీ అధిష్ఠానం సుముఖంగా ఉన్నట్టు నేతలు ముద్రగడకు వివరించారు. వీటన్నింటికి అంగీకరించిన ముద్రగడ ఈనెల 14-17వ తేదీల మధ్య ఆ పార్టీలో చేరడానికి అంగీకరించినట్టు తెలిసింది. ఆరోజు తాడేపల్లిలో జగన్ చేతుల మీదుగా పార్టీలో చేరనున్నట్టు వైసీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ విషయం అటు అధికారికంగా వైసీపీ ఇటు ముద్రగడ వర్గం ఇంకా ధ్రువీకరించలేదు. మరోపక్క పిఠాపురం నుంచి వంగా గీతను మార్చుతారని ప్రచారం జరిగినా తాజా పరిణామాల నేపథ్యంలో ఆమె అక్కడే కొనసాగించాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలుస్తోంది.

అప్పుడు దూరం పెట్టి.. ఇప్పుడు దగ్గరై..

అధికారంలోకి వచ్చిన తర్వాత కాపు రిజర్వేషన్లు, కాపు కార్పొరేషన్లకు వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. అయినా జగన్ ప్రభుత్వాన్ని ముద్రగడ ఏనాడు ప్రశ్నించలేదు. సరికదా తిరిగి ప్రతిపక్షాలపైనే లేఖాస్త్రాలు సంధిస్తూ వచ్చారు. ఈనేపథ్యంలో వైసీపీ అనుకూల నేతగా ముద్రగడ ముద్రపడ్డారు. అయితే త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేస్తారని ప్రచారం కూడా జరిగింది. అందులోభాగంగా ముద్రగడ లేదా ఆయన తనయుడికి వైసీపీ పిఠాపురం సీటు ఇస్తుందని ప్రచారం జరిగింది. ఎమ్మెల్యే ద్వారంపూడి అయితే కాకినాడ ఎంపీ టికెట్‌ను ముద్రగడ తనయుడికి ఇప్పించడానికి ప్రయత్నించారు. కానీ డిసెంబరులో టికెట్ల ప్రకటనలో భాగంగా వైసీపీ అధిష్ఠానం పిఠాపురం సీటును ఎంపీ వంగా గీతకు కట్టబెట్టింది. దీంతో ముద్రగడ అలిగారు. కారాలుమిరియాలు నూరారు. అలాగే రాజ్యసభ టికెట్ విషయంలోను వైసీపీ మాట తప్పడంపై తన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఇదికాకుండా కొన్ని తాను ఆశించిన విషయాల్లోను వైసీపీ పెద్దలు గౌరవప్రదంగా వ్యవహరించకపోవడంతో విసిగిపోయారు. ఆ తర్వాత ముద్రగడ టీడీపీలో చేరతారని ప్రచారం జరిగింది. కానీ అటు నుంచి కూడా స్పందన లేదు. అదే సమయంలో విషయం తెలిసి ముద్రగడను బుజ్జగించేందుకు వైసీపీ పెద్దలు ప్రయత్నించారు. కానీ వైసీపీ నేతలతో మాట్లాడడానికి ముద్రగడ ఇష్టపడలేదు. ఆ తర్వాత కొద్దిరోజులకు తాము జనసేనలోకి వెళ్తామని ముద్రగడ తనయుడు ప్రకటించారు. అదే సమయంలో కొందరు జనసేన నేతలు కూడా ముద్రగడ ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. సంక్రాంతి తర్వాత స్వయంగా పవన్ ముద్రగడ ఇంటికి వచ్చి పార్టీలోకి ఆహ్వానిస్తారని ప్రచారం జరిగింది. కానీ ఆ తర్వాత జనసేన పార్టీ కూడా తలుపులు మూసేసింది. ఈ నేపథ్యంలో ముద్రగడ అకస్మాత్తుగా పవన్‌ను విమర్శిస్తూ ఇటీవల లేఖాస్త్రం సంధించారు. తనను కలుస్తానని చెప్పి కలవలేదని పవన్‌ను దుమ్మెత్తిపోశారు. ఈ పరిణామాల నేపథ్యంలో జనసేనలో కూడా ముద్రగడకు దారులు మూసుకుపోయినట్టు అర్థమైపోయింది. దీంతో ముద్రగడకు వైసీపీ మినహా మరో ప్రత్యామ్నాయం లేకుండాపోయింది. అటు వైసీపీకి సైతం గోదావరి జిల్లాలో టీడీపీ, జనసేనను ఢీకొట్టే నేత లేకపోవడంతో మళ్లీ ముద్రగడ వైపు మనసు మళ్లించింది. ముద్రగడ సైతం తనకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో దూరం పెట్టిన వైసీపీ వైపే మళ్లీ దృష్టిపెట్టారు. ఇష్టం లేకపోయినా వేరే మార్గం లేకపోవడంతో వైసీపీలో చేరడానికి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ముద్రగడ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలుత వైసీపీని ఛీకొట్టి మళ్లీ అదే ఫ్యాన్ కిందకు వస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


పంచారామ క్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామి

మహాశివరాత్రికి ముస్తాబు

- శివరాత్రి ఉత్సవాలకు సామర్లకోటలో విస్తృత ఏర్పాట్లు
- లక్షల్లో భక్తులు వస్తారనే అంచనాతో మౌలిక సదుపాయాలు
- పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలోనూ భారీ ఏర్పాట్లు

సామర్లకోట, మార్చి 7: మహాశివరాత్రి ఉత్సవాలను జిల్లావ్యాప్తంగా ఉన్న శైవ క్షేత్రాలన్నీ ముస్తాబయ్యాయి. వేకువజాము మొదలుకొని సాయంత్రం వరకు భక్తులకు స్వామివార్లు దర్శనమిచ్చేలా ఎక్కడికక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే అన్నిచోట్లా ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు పూర్తిచేశారు. ప్రధానంగా పంచారామ క్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మూలవిరాట్‌కు అభిషేకాలు, పండిత సదస్యము నిర్వహిస్తారు. రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 12.15 గంటల వరకూ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లింగోద్భవకాల పూజలు పిఠాపురం మహారాజా వారి గోత్రనామాలతో జరుపుతారు. రాత్రి 12.30 గంటలకు మహానివేదన నిర్వహిస్తామని ఈవో నీలకంఠం తెలిపారు. కాగా తెల్లవారుజాము నుంచీ పవిత్ర స్నానాలతోపాటు స్వామి, అమ్మవారి దర్శనాలకు హాజరయ్యే వేలాది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసినట్టు ఉత్సవ ముఖ్య అధికారిణి, దేవదాయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని, ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠంలు తెలిపారు. గురువారం రాత్రి ఆలయం వద్ద వివిధ ఏర్పాట్లు పర్యవేక్షించిన అనంతరం విలేకరులతో వారు మాట్లాడుతూ, భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించేందుకు ఆలయ కోనేరు పుష్కరిణి, మూడు గోదావరి పుష్కరిణిలు సిద్ధం చేయడమేగాక జల్లు స్నానఘట్టాలు, మహిళలకు ప్రత్యేకంగా దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటుచేశామన్నారు. అలాగే వివిధ స్వచ్ఛంద సంస్థలు, దాతల సౌజన్యంతో పాలు, మజ్జిగ, పులిహోర, అన్నదానం, అల్పాహారం, చిన్నారులకు రొట్టెలు, పాలు పంపిణీ కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. పోలీసు, రెవెన్యూ, దేవదాయ, వైద్య ఆరోగ్య, మున్సిపల్, విద్యుత్, ఇరిగేషన్ తదితర శాఖల సహకారంతో భక్తులకు నిరంతరం సేవలందించేందుకు వీలుగా పూర్తి అందుబాటులో ఉంటామని ఆలయ అధికారులు తెలిపారు.

పాదగయలో...

పిఠాపురం, మార్చి7: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహాశివరాత్రి శుక్రవారం రావడంతో రథోత్సవం జరిగే శనివారం కూడా పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరించేందుకు భక్తులు అధికంగా తరలివచ్చే అవకాశం ఉంది. భక్తుల రద్దీని తట్టుకునేందుకు వీలుగా ప్రత్యేక క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటుచేశారు. గురువారం రాత్రి నుంచే స్నానాలకు అనుమతించారు. పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరించిన అనంతరం భక్తులందరికీ దర్శనమయ్యేలా క్యూలైన్లు నిర్మించారు. పాదగయ పుష్కరిణి వద్ద తాత్కాలిక హుండీలు ఏర్పాటుచేశారు. పర్యవేక్షణకుగానూ సీసీ కెమేరాలు ఏర్పాటుచేశారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఇక ఉత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తులో ఇద్దరు, డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 12మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులు, మహిళా సిబ్బంది 160 మంది విధులు నిర్వర్తిస్తారు. హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తరఫున పాదగయ క్షేత్రం వద్ద 30 మందిని నియమించి భక్తులకు సేవలందించనున్నట్టు ఏపీ స్టేట్ కమిషనరు రెడ్డెం బాబీ, అసిస్టెంట్ కమిషనర్ రామ్ గంగాధర్, స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ రాజశేఖర్‌లు తెలిపారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటుచేయడంతోపాటు పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పాదగయ క్షేత్రం మీదుగా వెళ్లే ట్రాఫిక్‌ను మళ్లించారు. ప్రభుత్వాసుపత్రి సెంటర్ నుంచి సామర్లకోట రోడ్డు వెళ్లే వాహనాలను బైపాస్‌రోడ్డు మీదుగా మళ్లించి ఈ రహదారిలో వాహనాల రాకపోకలను పూర్తిగా నియంత్రించారు. ఈ రోడ్డులో ఎటువంటి వాహనాలను అనుమతించరు. వాహనాలు, కార్లకు బైపాస్‌రోడులోని లేఅవుట్ స్థలాలు, ఇతర ఖాళీ స్థలాల్లో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పరిసరాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు.


పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు


యానాం ఎస్పీతో సమావేశమైన ఎస్పీ సతీష్‌కుమార్

సార్వత్రిక ఎన్నికల సక్రమ నిర్వహణకు పటిష్ఠ చర్యలు

యానాం ఎస్పీతో ఎస్పీ సతీష్‌కుమార్ సమీక్ష

మద్యం, నగదు, మాదక ద్రవ్యాల అడ్డుకట్టకు

మరిన్ని చెక్ పోస్టుల ఏర్పాటు

కాకినాడ క్రైం, మార్చి 7 : రానున్న సార్వత్రిక ఎన్నికల సక్రమ నిర్వహణ కోసం మద్యం, నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసేందుకు, చెక్ పోస్టుల వద్ద పటిష్ఠ నిఘా వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేయాలని కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ కోరారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో యానాం ఎస్పీ రాజశేఖరన్‌తోపాటు ఎస్ఈబీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా మద్యం, నగదు, మాదక ద్రవ్యాలు అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతమున్న చెక్‌పోస్టులకు అదనంగా మరిన్ని చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి, ఫ్లయింగ్ స్క్వాడ్, మొబైల్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. కోరంగి పోలీస్‌స్టేషన్, యానాం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ముఖ్యమైన రోడ్లు, చిన్న రోడ్లలో ప్రస్తుతం ఉన్న వాటికి అదనంగా మరిన్ని చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. అక్రమ రవాణా నిరోధానికి యానాం, జిల్లా పోలీసులు పటిష్ఠమైన సమాచార వ్యవస్థ, పరస్పర సమాచార మార్పిడితో అక్రమ రవాణాను అడ్డుకోవచ్చని, అవసరమైన ఏర్పాట్లుచేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎస్ఈబీ అదనపు ఎస్పీ శ్రీలక్ష్మి, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఎస్డీపీవో హనుమంతరావు, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



పాదగయలో మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వానపత్రిక.. అందులోనే సీఎం జగన్, ఇతరుల ఫొటోలు

శివరాత్రి ఉత్సవాల్లో అధికారుల అత్యుత్సాహం

ఆహ్వాన పత్రికల్లో సీఎం జగన్, మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల ఫొటోలు

ఇదేం ప్రచారమంటూ భక్తుల మండిపాటు

పిఠాపురం, మార్చి7: పిఠాపురం పట్టణంలో ప్రసిద్ధి చెందిన పాదగయ క్షేత్రంలో ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా దేవదాయ శాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. సంప్రదాయాలకు తిలోదకాలు ఇస్తూ ఉత్సవాలకు ముద్రించిన ఆహ్వాన పత్రికల్లో దేవుడి ఫొటోలతోపాటు ముఖ్యమంత్రి జగన్, దేవదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ, కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబుల ఫొటోలను ప్రచురించారు. గతంలో ఆహ్వానపత్రికపై పేర్లు, కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి ఫొటోలు మినహా వ్యక్తులు, ప్రజాప్రతినిధులు ఫొటోలు ముద్రించే సంప్రదాయం లేదు. అయితే ఈసారి ఆహ్వాన పత్రికల్లో సీఎం, మంత్రి, ఇతర ప్రజాప్రతినిధుల ఫొటోలను ముద్రించడం విస్మయాన్ని కలిగించింది. అధికార వైసీపీ పాలకుల ప్రాపకం కోసమే దేవదాయశాఖ అధికారులు ఇలా చేశారంటూ భక్తులు మండిపడుతున్నారు. దేవుడి కార్యక్రమాలో ఇదేమి ప్రచారమంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం ఆహ్వానపత్రికల ఫొటోలను తీసి సోషల్ మీడియాలో పెట్టి విమర్శలు గుప్పిస్తున్నారు.


మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు, పంతం

ఉమ్మడి అభ్యర్థి నానాజీ విజయానికి కృషి చేస్తాం : మాజీ ఎమ్మెల్యే పిల్లి

సర్పవరం జంక్షన్, మార్చి7: అధిష్ఠానం ఆదేశాల మేరకు టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ గెలుపుకోసం శాయశక్తుల కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణమూర్తి దంపతులు స్పష్టంచేశారు. గురువారం వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ కేడర్‌కు తగిన ప్రాధాన్యం కల్పించాలని, ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని వెళ్లాల్సిన బాధ్యత ఉందని, తన వెంట ఉన్న కేడర్‌కు భరోసా కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలోనే ఉన్నామని, చివరి వరకు పార్టీలోనే కొనసాగడం జరుగుతుందన్నారు. టీడీపీలో సీనియర్ నాయకులు, సీనియర్ ఎమ్మెల్యే పిల్లి దంపతులని, ఒకే పార్టీలో ఉన్న చరిత్ర వీరికే దక్కిందని జనసేన అభ్యర్థి పంతం నానాజీ అన్నారు. తాను కాంగ్రెస్ నుంచి జనసేనలోకి వచ్చానన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక సాయం చెక్కు అందజేత

కాకినాడసిటీ, మార్చి7: మహిళా సాధికారిత లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, ఆర్థిక సహాయం ఆలంబనగా మహిళలు అన్ని రంగాల్లో నిర్ణయాత్మక శక్తులుగా ఎదగాలని కలెక్టర్ కృతికాశుక్లా కోరారు. గురువారం అనకాపల్లి జిల్లా నుంచి సీఎం జగన్ మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నాల్గవ విడత ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి అందించారు. ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని గురువారం కలెక్టరేట్ నుంచి కృతికాశుక్లా, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ.. జిల్లాకు చెందిన లబ్ధిదారులతో కలిసి వీక్షించారు. సీఎం బటన్ నొక్కిన అనంతరం జిల్లాలోని 1,01,759 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.190 కోట్ల 80 లక్షల ఆర్థిక సహాయం పంపిణీ చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కె శ్రీరమణి, మెప్మా పీడీ బి ప్రియంవద, ఎస్సీ కార్పొరేషన్ ఇన్చార్జి ఈడీ జె సత్యవతి, అధికారులు పాల్గొన్నారు.



ఎందుకున్నట్టు.. ఏం చేస్తున్నట్టు?

- ఉత్సవ విగ్రహాల్లా ఏఎంసీలు
- కానరాని రైతు అనుబంధ సేవలు
- స్థానిక సంస్థలకు కేటాయింపులు లేవు
- అడ్రస్‌లేని పశువైద్య శిబిరాలు
- వచ్చిన ఆదాయం నేరుగా ఖజానాకే
- దయనీయంగా వ్యవసాయ మార్కెట్ కమిటీలు

పెద్దాపురం, మార్చి7 : వ్యవసాయ మార్కెట్ కమిటీలు పూర్తిగా ఉత్సవ విగ్రహాల్లా మారిపోయాయి. ఏర్పాటు చేసిన లక్ష్యం మరిచాయి. రైతులకు కనీస స్థాయిలో సేవలు అందజేయడం లేదు. గత నాలుగేళ్లుగా దయనీయంగా కొనసాగుతున్నాయి. ప్రతి ఏటా కోట్లలో ఆదాయం ఉంటున్నా రైతు అనుబంధ సేవలేవీ అందిన దాఖలాలు కనిపించడం లేదు. పశువైద్య శిబిరాలకుగానీ, స్థానిక సంస్థల్లో మౌలిక వసతులకుగానీ ఒక్క రూపాయి కేటాయింపులు లేవు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఉన్న 9 మార్కెట్ కమిటీల్లో ఈ పరిస్థితే కనిపిస్తోంది. వ్యవసాయ రంగాల సేవలకు సంబంధించి ప్రస్తావిస్తే మౌనమే అధికారుల నుంచి వచ్చే సమాధానంగా ఉంటోంది. సాధారణంగా వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చెక్ పోస్టులు, గోదాముల నిర్వహణ, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సమయంలో సెస్ వసూళ్ల ద్వారా ఆదాయం సమకూరుతోంది. ముఖ్యంగా ధాన్యం కొనుగోలుకు సమయంలో అత్యధిక ఆదాయం సమకూరుతోంది. గోదాముల అద్దెల రూపేణా ఆదాయం వస్తోంది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం ఏఎంసీలను ఆదాయ వనరులుగా చూస్తున్నారే తప్ప గత ప్రభుత్వాలు అందించిన సేవలనూ కొనసాగించలేదు. వస్తున్న ఆదాయం కాస్తా నేరుగా రాష్ట్ర ఖజానాకు వెళ్లిపోతోందని పలువురు రైతులే విమర్శిస్తున్నారు. స్థానిక సంస్థల వాటాలనూ చెల్లించడం లేదని తెలుస్తోంది. అటు రైతులకు సంబంధించి పశువైద్య శిబిరాలు, సీజన్ల వారీగా పశువులకు టీకాలు మందులు వేయడం లేదు. జిల్లాకు సంబంధించి 69 రహదారి పనులకు సంబంధించి రూ.37 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని అధికారులు చెబుతున్నా ఇప్పటికీ ఒక్క పని కూడా పూర్తయినట్టు లేదు. దీంతో పొలాలకు వెళ్లే రహదారి మార్గాలు పూర్తి అధ్వానంగా మారిపోయాయి. దీంతో పంటల రవాణా సమయంలో రైతుల పాట్లు అన్నీఇన్నీ కావు.

కేటాయింపులేవీ..

సాధారణంగా నియోజకవర్గానికి ఒకటి లేదా రెండు ఏఎంసీ కార్యాలయాలుంటాయి. ఆయా ఏఎంసీలు పరిధిలో ఉండే మండలాలకు ఆదాయంలో కొంతభాగం కేటాయించాలి. వెనుకబడిన గ్రామాలు, పూర్తి వ్యవసాయాధారిత పంచాయతీలకు ఏఎంసీ వాటా నిధులు కేటాయించాలి. గతంలో గ్రామాల్లో సీసీ రహదారులు, కాలువలు, ఇతరత్రా మౌలిక వసతుల కోసం ఈ నిధులు కేటాయించేవారు. స్థానిక సంస్థల ప్రతినిధులు సైతం ఈ నిధుల కోసం ఎంతగానో ఎదురుచూసేవారు. నేడు ఏఎంసీల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు వెళ్లిపోతుండగా తిరిగి పైసా రావడం లేదు. ఆర్థిక సంఘం సాధారణ నిధులను సైతం ప్రభుత్వం దారి మళ్లిస్తోంది.. ఏఎంసీ నిధులు ఒక లెక్కా అన్న ప్రశ్న సర్వత్రా ఉత్పన్నమవుతోంది.

రెక్కీ నిర్వహించి..పక్కా ప్లాన్ వేసి..

ఉత్తరకంచిలో బ్యాంకు దోపిడీ నిందితుల అరెస్టు

కిలో బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం

పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలింపు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్



స్వాధీనం చేసుకున్న సొత్తు

కాకినాడ క్రైం, మార్చి 7: వేర్వేరు రాష్ట్రాలకు చెందిన ఏడుగురు సభ్యులు ఒక ముఠాగా ఏర్పడి గత నెల 7వ తేదీన ప్రత్తిపాడు మండలం, ఉత్తరకంచి ఎస్‌బీఐ బ్యాంకు బ్రాంచ్‌లో దోపిడీకి పాల్పడ్డారని ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ తెలిపారు. ఇంటింటికీ తిరిగి దుప్పట్లు విక్రయించే వ్యాపారస్తుల మాదిరిగా లాడ్జి లో బస చేసి అక్కడ నుంచి ఫోన్‌లో గూగుల్ మ్యాప్ ద్వారా మారుమూల ప్రాంతాల్లోని బ్యాంకులను గుర్తించి వాటి దోపిడీయే లక్ష్యంగా పక్కా పథకం అమలు చేస్తారని ఎస్పీ చెప్పారు. నెలరోజుల వ్యవధిలోనే చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి కిలో బంగారు ఆభరణాలు, రూ.1,19,700 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన మరో ముగ్గురి నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయ, సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎస్పీ వివరాలు అందించారు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి ప్రత్యేక్ష పర్యవేక్షణలో ట్రైనీ ఐపీఎస్ నవజ్యోతి మిశ్రా, ట్రైనీ డీఎస్పీ సాయి ఈశ్వర్ సారథ్యంలో బృందాలుగా విడిపోయి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా నిఘాను పటిష్టం చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పోలీస్ బృందాలు పెట్రోలింగ్ చేస్తుండగా రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురు వ్యక్తులు తారాసపడ్డారు. వారిని అదుపులోకి తీసుకునే క్రమంలో ముగ్గురు పోలీసుల నుంచి తప్పించుకుని పరారయ్యారు. మిగిలిన నలుగురిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారు. ఉత్తరప్రదేశ్‌లోని బదానీ జిల్లా, బరాలీ మండలం, హస్పూర్ హరియా గ్రామానికి చెందిన 25 ఏళ్ల ధన్విర్ అలియాస్ గ్యాస్‌స్టౌవ్, అలియాస్ మేస్త్రీ, మహారాష్ట్ర, బుల్దాన్ జిల్లా, చిక్కిలి తాలుకా పింపుల్ గావ్ వుండా పోస్ట్, నైగావ్ గ్రామానికి చెందిన 25 ఏళ్ల అక్షయ్ గజానన్ అంబోర్, అదే ప్రాంతానికి చెందిన 23 ఏళ్ల హరీష్ మిలింద్ గైక్వాడ్, మహారాష్ట్ర, అమరావతి జిల్లా, ఎర్ల గ్రామానికి చెందిన 23 ఏళ్ల వైభవ్ నారాయణరావ్ అడోల్ తదితరులు మరో ముగ్గురితో కలిసి ఒక ముఠాగా ఏర్పడి బ్యాంక్ చోరీకి పాల్పడ్డారన్నారు. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి కొన్ని రోజుల ముందే రాష్ట్రానికి వచ్చి ఇక్కడ కొన్ని బ్యాంకుల వద్ద రెక్కీ చేసుకుని తిరిగి మహారాష్ట్రకు వెళ్లి అక్కడ నుంచి ధన్విర్‌ను, అలాగే ప్రస్తుతం పరారీలో ఉన్న మరో నిందితుడిని తీసుకుని మండపేట చేరుకుని దుప్పట్ల వ్యాపారం నిమిత్తం వచ్చామని లాడ్జిలో రూం తీసుకున్నారు. అక్షయ్, వైభవ్, హరీష్, పరారీలో ఉన్న నిందితుడు కలిసి మండపేటలో ఓ బ్యాంకు దొంగతనం చేసేందుకు రెక్కీ నిర్వహించి అనువుగా లేకపోవడంతో మండపేటలో లాడ్జి ఖాళీ చేసి సామర్లకోటలో ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నారు. గూగుల్ ద్వారా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి, ఎస్‌బీఐ బ్యాంక్ శాఖను దోపిడీ చేసేందుకు అనువైనదిగా గుర్తించారు. గత నెల 7న రాత్రి మొత్తం ఏడుగురు కలిసి ఉత్తరకంచి వచ్చి బ్యాంక్ చుట్టుపక్కల రెక్కీ చేసి నేరం చేసేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకుని ఉత్తరకంచి గ్రామ శివారుకు చేరుకుని హరీష్ అనే వ్యక్తిని కారు తీసుకుని వెళ్లిపోయి తిరిగి తెల్లవారు జామున నాలుగు గంటలకు రమ్మని చెప్పి మిగిలిన ఆరుగురు కారు దిగి పొలాల్లో నుంచి శ్మశానం మీదుగా రాత్రి ఒంటిగంట సమయంలో బ్యాంక్ వద్దకు చేరుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అనంతరం బ్యాంక్ వెనుక కిటికీని కట్ చేసి బ్యాంక్ లోపలకి వెళ్లి గుమ్మం వద్ద ఉన్న అలారం వైర్‌లను అలాగే బ్యాంక్ సీసీ టీవీ వైర్లను కట్ చేసి బయట కిటికీల వద్ద వైభవ్ మరో నిందితుడిని కాపలాగా పెట్టి ధన్విర్, అక్షయ్, మరో నిందితుడు కలిసి బ్యాంక్‌లోకి వెళ్లగా ధన్విర్ మరో ఇద్దరు బ్యాంక్ స్ట్రాంగ్ రూం తాళాలు పగలగొట్టి అక్కడ ఉన్న నాలుగు లాకర్లలో రెండు లాకర్లను గ్యాస్‌కట్టర్‌తో కట్ చేసి రూ. 27,34,320 నగదును అలాగే సుమారు రూ.1,18,84,296 విలువైన మూడు కిలోల 280 గ్రాముల బంగారు ఆభరణాలను సంచులలో వేసుకుని బ్యాంక్‌లో బంగారు తూకం వేసే ఎలక్ట్రానిక్ త్రాసును, క్యాష్ కౌంటింగ్ మిషన్‌ను తీసుకుని గ్యాస్ సిలిండర్‌ను ఇతర సామగ్రిని బ్యాంక్‌లోనే వదిలివేసి బ్యాంక్ వెనుక నుంచి మెయిన్ రోడ్డు మీదకు వచ్చి తెల్లవారు జామున 4 గంటల సమయంలో కారు ఎక్కి సామర్లకోట వెళ్లిపోయినట్లు ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు. అక్కడ బ్యాంక్ నుంచి తెచ్చిన ఎలక్ట్రానిక్ కాటాతో బంగారాన్ని తూచి, క్యాష్ కౌంటింగ్ మిషన్‌తో క్యాష్ లెక్కించి ఏడుగురు వాటాలు పంచుకుని 8 తేదీన రెండు బృందాలుగా విడిపోయి కారులో నలుగురు మహారాష్ట్రకు, ముగ్గురు రైలులో ఉత్తరప్రదేశ్‌కు వెళ్లిపోయినట్లు ఎస్పీ తెలిపారు. అయితే పట్టుబడిన నలుగురు నిందితుల నుంచి రూ. 30,69,700 విలువైన కేజీ బంగారం, రూ.1,19,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన ముగ్గురు నిందితుల కోసం అలాగే మిగిలిన చోరీ సొత్తు రికవరీ కోసం దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారిని, ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు, పెద్దాపురం సీసీఎస్ సీఐ అంకబాబు, కాకినాడ సీసీఎస్ సీఐ చిట్టిబాబు, కాకినాడ ట్రాఫిక్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, సామర్లకోట సీఐ డి.సురేష్, టూటౌన్ సీఐ నాగేశ్వర్ నాయక్, ఐటీ కోర్ సీఐ పి.శ్రీనివాస్, రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ, ప్రత్తిపాడు ఎస్ఐ పవన్‌కుమార్ తదితరులను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ భాస్కరరావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీరామ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ స్కీం పనులకు మోదీ శంకుస్థాపన

వర్చువల్ విధానంలో కార్యక్రమాన్ని వీక్షించిన నేతలు, అధికారులు



వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న ప్రధాని మోదీ



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అన్నవరం, మార్చి7: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో భక్తుల సౌకర్యాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ 20.06 కోట్లకు సంబంధించిన పనులకు గురువారం ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూ కశ్మీర్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఉదయం 11 గంటలకు రత్నగిరిపై రామాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అధికారులు, సిబ్బంది, భక్తులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ ఈఈ మూర్తి మాట్లాడుతూ రూ.11.50 కోట్లతో 50 వేల చదరపు అడుగులలో 1600 మంది ఒకేసారి అన్నప్రసాదం స్వీకరించే విధంగా నూతన అన్నదాన భవనం ప్రస్తుత టీటీడీ సత్రం ప్రదేశంలో నిర్మించనున్నట్లు చెప్పారు. అలాగే అక్కడే భక్తులు వేచి ఉండేందుకు రూ.5.94 కోట్లతో క్యూకాంప్లెక్స్, రూ.61.85 లక్షలతో మరుగుదొడ్లు, స్నానపు గదులు, రూ.1.02 కోట్లతో 4 ఎలక్ట్రికల్ బస్సులు, రెండు చార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ శిలాఫలకం ఆవిష్కరించారు. ఎంపీ గీత మాట్లాడుతూ ప్రసాద్ పథకం పనులకు మోదీ శంకుస్థాపన చేయడం ద్వారా జాతీయస్థాయిలో అన్నవరం ఆలయానికి మరింత గుర్తింపు వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్, రాష్ట్ర టూరిజం అధికారులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు

ఘనంగా ముగిసిన మహారుద్రాభిషేకం

ఏలేరు నదిలో పార్థివ లింగాల నిమజ్జనం



ఏలేరు నదిలో లింగాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

జగ్గంపేట, మార్చి7: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నదీ తీరాన వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో జ్యోతుల నెహ్రూ కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి పార్థివ లింగ మహారుద్రాభిషేకం ఘనంగా ముగిసింది. గురువారం ఉదయం 8.30 గంటలకు పూర్ణాహుతి గావించారు. శ్రీ శృంగేరి జగద్గురు కృప పోషిత మఠాధిపతి జగద్గురు పరమహంస, తుని తపోవన మఠాధిపతి సచ్చిదానంద సరస్వతి మహాస్వామి హాజరై పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని కోటి లింగాలను దర్శించుకున్నారు. అనంతరం లింగాలను భక్తులు ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. పెద్దాపురం ఎమ్మెల్యే, మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని కోటి లింగాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామిజీలు మాట్లాడుతూ ఆ శివుడి సంకల్పంతో జ్యోతుల నెహ్రూ కుటుంబం ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసిందన్నారు. అనంతరం వేలాదిగా వచ్చిన భక్తులందరికీ మహా అన్న ప్రసాదం అందించారు. కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, దాసరి తమ్మన్నదొర, తుమ్మల బాబు, ఆకుల రామకృష్ణ, కోర్పు సాయితేజ, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, అడబాల భాస్కరరావు, కుంచే రాజా, అడబాల రామాంజనేయులు, జీను మణిబాబు, మునిరెడ్డి నాగేశ్వరరావు, సుంకవిల్లి రాజు, దాపర్తి సీతారామయ్య, పైడిపాల సూరిబాబు, జంపన రవివర్మ తరలివచ్చారు.



శివలింగానికి అభిషేకం చేస్తున్న సచ్చిదానంద సరస్వతి

స్వీట్ల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

కడియం, మార్చి 7: కడియం మండలం దుళ్లలో గురువారం నాలుగు స్వీటు షాపులపై విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. దత్తసాయి స్వీట్‌స్టాల్ యజమాని బాలసుబ్రహ్మణ్యం ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అనుమతులు లేకుండా స్వీట్స్ తయారు చేస్తున్నారంటూ నోటీసులు జారీ చేశారు. అలానే లూజ్ పామాయిల్, మైసూర్‌పాక్ నమూనాలను విశ్లేషణ కోసం సేకరించారు. స్టాంప్ లేని 10 కిలోల తూకపు యంత్రాన్ని ఉపయోగిస్తున్నారంటూ లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారు. వెంకటసాయి స్వీట్ స్టాల్‌ను తనిఖీ చేయగా స్వీట్‌స్టాల్ యజమాని ఎన్.శ్రీను ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అనుమతులు లేకుండా స్వీట్స్ తయారు చేస్తున్నారంటూ నోటీసులు జారీ చేశారు. బందరు లడ్డూ నమూనాను విశేషణ నిమిత్తం సేకరించారు. లక్ష్మీ స్వీటు స్టాల్‌ను తనిఖీ చేయగా యజమాని ఈ.నందీశ్వరరావు ఫుడ్‌సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అనుమతులు లేకుండా స్వీట్స్ తయారు చేస్తున్నారంటూ నోటీసులు జారీ చేశారు. సిరివైభవ స్వీట్‌డైరీని తనిఖీ చేయగా యజమాని డి.శివ ఫుడ్‌సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అనుమతులు లేకుండా స్వీట్స్ తయారు చేస్తున్నారంటూ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేవీఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్వీటు స్టాల్స్, రెస్టారెంట్ పరిసరాలు, కిచెన్‌లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ తనిఖీలలో ముత్యాల నాయుడు, నాగవెంకటరాజు, భార్గవ మహేష్, ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు ఉన్నారు.

10న ఎస్ఏ పదోన్నతులకు అర్హులైన ఎస్జీటీలు హాజరుకావాలి

కాకినాడ రూరల్, మార్చి7: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎస్జీటీలుగా పనిచేస్తూ స్కూల్ అసిస్టెంట్ (ప్రత్యేక విద్య) పదోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 10న సర్వీస్ రిజిస్టర్, అర్హత సర్టిఫికెట్లతో మధ్యాహ్నం 2 గంటలకు కాకినాడ డీఈవో కార్యాలయంలో హాజరుకావాలని డీఈవో రమేష్ తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం పదోన్నతుల కౌన్సిలింగ్ నిర్వహించనున్నామన్నారు.

ఆర్జిత సేవగా సత్యదేవుడి రథసేవ

పలు అభివృద్ధి పనులకు పాలకమండలి ఆమోదం

అన్నవరం, మార్చి 7: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో పలు అభివృద్ధి పనులకు గురువారం పాలకమండలి ఆమోదం తెలిపింది. చైర్మన్ ఐ.వి రోహిత్ అధ్యక్షతన జరిగిన పాలక మండలి సమావేశంలో పలు అంశాలను సభ్యులు ఆమోదించారు. ప్రధానంగా ప్రతి ఆదివారం నిర్వహించే సత్యదేవుడి రథసేవను ఆర్జితసేవగా నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి రూ.2500 టిక్కెట్టు ధరతో నలుగురికి ప్రవేశం కల్పించాలని తీర్మానించారు. రూ.34 లక్షలతో వనదుర్గ ఘాట్‌లో మట్టి పనిచేసేందుకు ప్రతిపాదన చేయగా కమిషనర్‌కు నివేదించాలని నిర్ణయించారు. ఇటీవల పిలిచిన పలు టెండర్లకు లోయెస్ట్ ధరను ఆమోదించారు. దేవస్థానం కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుల గంటల వ్యవధి వేతనం నుంచి కన్సాలిడేట్ చెల్లింపుగా మార్చాలని ప్రతిపాదించారు. సత్యదేవుడి బంగారు ధ్వజస్తంభం ప్రతిష్ఠించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలు ఈనెల 18 నుంచి ప్రారంభించనున్నట్లు ఈవో సభ్యులకు తెలిపారు.

బ్యారేజ్‌పై ఇనుప గడ్డర్లు తొలగింపు

వాచ్‌మన్‌ను బెదిరించిన వారిపై కేసు నమోదు

కొవ్వూరు, మార్చి 7 : విధి నిర్వహణలో ఉన్న వాచ్‌మన్‌ను కొట్టి, చంపుతానని బెదిరించిన 8 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు రూరల్ ఏఎస్ఐ వై.శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. బొబ్బర్లంక గ్రామానికి చెందిన బొర్రా సత్యనారాయణ విజ్జేశ్వరం బ్యారేజ్‌పై వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 2వ తేదీన తండ్రికి సహాయకుడిగా బొర్రా సత్తిబాబు వాచ్‌మన్ డ్యూటీకి వచ్చాడు. అర్ధరాత్రి 12-30 గంటల సమయంలో బొబ్బర్లంక, మద్దూరులంక గ్రామాలకు చెందిన కొంతమంది వ్యక్తులు బ్యారేజ్‌పైకి వచ్చి విజ్జేశ్వరం బ్యారేజ్‌పై భారీ వాహనాలు వెళ్లకుండా ఏర్పాటుచేసిన ఇనుప గడ్డర్‌ను తొలగించి పక్కనే ఉన్న నీటిలో పడివేశారు. అడ్డువచ్చిన సత్తిబాబును కొట్టి, చంపుతామని బెదిరించారు. దీనిపై సత్తిబాబు కొవ్వూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ వై. శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

నిడదవోలు, మార్చి 7: నిడదవోలు చాగల్లు రైల్వే స్టేషన్ల మధ్య గురువారం విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు ఢీకొని సుమారు 35 సంవత్సరాల వయస్సు గల యువకుడు మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం జీఆర్‌పీ ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు. యువకుడి ఒంటిపై తెలుపురంగు కట్ బనియన్, నీలం రంగు జీన్స్ ప్యాంటు ఉందని చెప్పారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని గుర్తించిన వారు లేదా సమాచారం తెలిసిన వారు 9490617090, 7013360296కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

313 కిలోల గంజాయి స్వాధీనం

దేవరపల్లి, మార్చి 7: గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. సెబ్ డీఎస్పీ కె.జయమౌనిక వివరాలు వెల్లడించారు. కొవ్వూరు నుంచి గోపాలపురం వైపు వెళ్తున్న లారీలో 313 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సెబ్ బ్యూరో రవిప్రకాశ్, సెబ్ ఎస్పీ మహేశ్వరరాజు, సెబ్ డీఎస్ఈవో పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా హరియాణాకు చెందిన గూడ్స్ లారీ భువనేశ్వర్ లోడు వేసుకుని వెళ్లి అక్కడ దిగుమతి చేసుకుని తిరుగు ప్రయాణంలో రాజమహేంద్రవరంలో 313 కిలోల గంజాయిని క్యాబిన్‌లో వేసుకుని వస్తుండగా లారీని గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను తారీఫ్, ముస్తాఫాను అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని అన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ సీఐ కేవీ స్వామి, ఎస్ఐ సుధీర్, డీటీఎఫ్ గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

శెట్టిబలిజలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం



ఐక్యత చాటుతున్న నాయకులు

కొత్తపేట, మార్చి7: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి వెన్నంటే నిలిచిన శెట్టిబలిజలకు చట్టసభలలో ప్రాధాన్యం కల్పించాలని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం కోరారు. స్థానిక ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాల్ ప్రాంగణంలో రాష్ట్ర టీడీపీ శెట్టిబలిజ సాధికార కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు అధ్యక్షతన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శెట్టిబలిజల సాధికారత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రెడ్డి సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకూ ప్రకటించిన అసెంబ్లీ స్థానాల్లో శెట్టిబలిజలకు స్థానం లేకపోవడం ఆవేదన కలిగించిందని, అధికార వైసీపీ మూడు అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లను శెట్టిబలిజలకు కేటాయించిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీకి వెన్నంట ఉండే శెట్టిబలిజలకు రెండు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానం కేటాయించాలని కోరారు. అది వీలుకానప్పుడు నామినేటెడ్ పదవులలో శెట్టిబలిజలకు ప్రాధాన్యం ఇస్తామని అధిష్ఠానం హామీ ఇవ్వాలన్నారు. రామచంద్రపురం టీడీపీ టిక్కెట్టు సుబ్రహ్మణ్యంకు కేటాయించాలని శెట్టిబలిజ నాయకులు డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, కేతా శ్రీను, కాదా వెంకటరమణ, చెల్లబోయిన శ్రీను, మొల్లేటి శ్రీను, మల్లుల పొలయ్య, మేడిశెట్టి సూర్యనారాయణ, పితాని వీరభద్రరావు, గుత్తుల పట్టాభిరామారావు, యల్లమిల్లి జగన్మోహన్, కముజు వెంకటేశ్వరరావు, మట్టపర్తి రాజేశ్వరరావు, మట్టపర్తి అచ్యుత్, వనుము వీరబ్రహ్మం, గుబ్బల మూర్తి, కడలి వెంకటేశ్వరరావు, చొల్లంగి వీరబాబు పాల్గొన్నారు.



సూక్ష్మ శివలింగం



సత్యనారాయణ

మండపేట, మార్చి 7: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన సూక్ష్మ వస్తువుల తయారీదారుడు అండలూరి వీరవెంకట సత్య నారాయణ శివరాత్రిని పురస్కరించుకుని గురువారం జాతి మరకత పచ్చతో మూడు గంటలు శ్రమించి అతి చిన్న సైజులో సూక్ష్మ శివలింగాన్ని తయారు చేశాడు. ఆయనను పలువురు అభినందించారు.

వైసీపీలోకి ముద్రగడ పద్మనాభం

ఈ నెల 14-17 మధ్యలో ఏదో ఒకరోజు ముహూర్తం



ముద్రగడను కలిసిన మిథున్‌రెడ్డి

కిర్లంపూడి, మార్చి 7: కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరడం ఖాయమైపోయింది. ఈనెల 14 నుంచి 17వ తేదీ మధ్యలో తాడేపల్లిలో జగన్ సమక్షంలో ముద్రగడ వైసీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ మేరకు ఆయనను పార్టీలోకి ఆహ్వానిస్తూ ఎంపీ మిథున్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి వెళ్లారు. ఆయనతో చాలాసేపు చర్చలు జరిపారు. సీఎం జగన్‌తో సూచనల మేరకు పార్టీలోకి ఆహ్వానించేందుకు వచ్చినట్టు వారంతా వివరించారు. ఈ నేపథ్యంలో జరిగిన చర్చల అనంతరం వైసీపీలో చేరేందుకు ముద్రగడ అంగీకరించారు. అయితే తేదీ ఏదనేది అధికారికంగా వైసీపీ, ముద్రగడ వర్గం ధ్రువీకరించాల్సి ఉంది. భవిష్యత్తులో రాజ్యసభ, ప్రస్తుతానికి ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు ముద్రగడ తనయుడికి కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చేలా గురువారం చర్చలు జరిగినట్టు తెలిసింది. ముద్రగడతో భేటీ అనంతరం ఎంపీ మిథున్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ముద్రగడను సీఎం జగన్ వైసీపీలోకి ఆహ్వానించారని, అందుకే తాము వచ్చినట్టు చెప్పారు. సుదీర్ఘ చర్చల అనంతరం ఆయన మంచి నిర్ణయం ప్రకటిస్తున్నారని ఆశిస్తున్నామన్నారు. ముద్రగడకు ఏ ఆఫర్ ఇవ్వలేదన్నారు. ముద్రగడ పార్టీలోకి వస్తే జగన్ ఆయనకు సముచిత స్థానం కల్పిస్తారని చెప్పారు. మిథున్‌రెడ్డి వెంట కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత, వైసీపీ జగ్గంపేట, పెద్దాపురం ఇన్‌చార్జిలు తోట నరసింహం, దవులూరి దొరబాబు, వైసీపీ నాయకుడు జక్కంపూడి గణేష్ ఉన్నారు.

విద్యుత్ వెలుగుల్లో పాదగయ



పిఠాపురం, మార్చి 7: పాదగయ క్షేత్రం విద్యుత్ కాంతుల వెలుగులతో కాంతు లీనుతోంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధాన, ఉప ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పాదగయకు వెళ్లే ప్రధాన రహదారుల్లోనూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

పాదగయ క్షేత్రంలో నేడు

పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల నుంచి స్వామి నిజరూప దర్శనం, ఉదయం 6 గంటలకు కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం, రాజరాజేశ్వరీదేవికి కుంకుమార్చన, ఉదయం 10 గంటలకు గ్రామోత్సవం, సాయంత్రం 5 గంటలకు సదస్యము, పండిత సభ సాయంత్రం 6.00 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 8 గంటల నుంచి స్వామికి లింగోద్భవ కాలాభిషేకం, అర్ధరాత్రి దాటిన తర్వాత నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.



వారసత్వం కోసం కాపుజాతిని తాకట్టు పెట్టొద్దు

కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు



మాట్లాడుతున్న పురంశెట్టి మంగారావు

అమలాపురం టౌన్, మార్చి 7: వారసత్వ, స్వార్థ ప్రయోజనాల కోసం కాపుజాతిని తాకట్టు పెట్టవద్దని కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు హెచ్చరించారు. కాపు నాయకులు చేగొండి హరిరామజోగయ్య, ముద్రగడ పద్మనాభం వారి వారసత్వ రాజకీయ ప్రయోజనాల కోసం స్వార్థ రాజకీయాలకు తెరదీశారని విమర్శించారు. అటువంటి నాయకులను కాపు అనుబంధ కులాలు అనుసరించే ప్రశ్నే లేదన్నారు. డాక్టర్ బీఆర్ కోనసీమ జిల్లా అమలాపురంలో గురువారం కాపునాడు కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాపు కులస్తులను ఓటు బ్యాంకులుగా చూడవద్దని సూచించారు. కాపులను వెనుకబడినతరగతులుగా గుర్తించి రిజర్వేషన్ కల్పించే సత్తా ఉన్న రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. కాపునాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్ మాట్లాడుతూ వెనుకబాటు తనంతో మగ్గుతున్న కాపు, తెలగ, బలిజ, ఒంటరి, మున్నూరు ఉపకులాల అభివృద్ధికి రాజకీయ పార్టీలు డిక్లరేషన్ ప్రకటించాలన్నారు. 20 అంశాలతో కూడిన డిక్లరేషన్‌ను ఆయన విడుదల చేశారు. కాపునాడు నాయకులు పత్తి దత్తుడు, గంగుమళ్ల శ్రీనివాస్, త్సవటపల్లి నాగు, ఉంగరాల అబ్బులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అప్రమత్తత కోసం మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, మార్చి 7: తమ్మవరంలో ఎన్‌సీఎస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, పనసపాడులో దేవీ ఫిషరీస్ పరిశ్రమలో అమ్మోనియా వాయువు లీకేజీ అయితే ఎటువంటి రక్షణ, సహాయక చర్యలు తీసుకుంటారో వివరిస్తూ గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.రాధాకృష్ణ మాక్‌డ్రిల్‌కు సంబంధించిన వివరాలు అందించారు. కేంద్ర, రాష్ట్ర జిల్లా విపత్తుల నియంత్రణ సంస్థల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలో ప్రమాదాలకు ఆస్కారం ఉన్న అమ్మోనియా పరిశ్రమలు సుమారు 30 ఉన్నాయన్నారు. అలాగే మోటారు స్పిరిట్ వినియోగించే పరిశ్రమలు అధికంగా ఉన్నాయన్నారు. మాక్ డ్రిల్ నిర్వహిస్తే భద్రత, రక్షణ ఇతర ప్రమాణాలు మెరుగ్గా ఉంటుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మాక్ డ్రిల్‌లో గమనించిన అంశాల ఆధారంగా విపత్తు నియంత్రణ సంసిద్ధతపై యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. ఏపీఎస్‌డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కట్టా సాంబయ్య, తహశీల్దార్ ఏడీ శ్రీనివాస్, అగ్నిమాపక శాఖ అధికారి సురేంద్ర ఆనంద్, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, పొల్యూషన్ ఈఈ ఎన్.సందీప్, దేవీ ఫిషరీస్, ఎన్‌సీఎస్ అధికారులు పాల్గొన్నారు.

శిక్షణా ఏర్పాట్లు పరిశీలించిన ఈఆర్వో

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 7: త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి స్థానిక పీఆర్ కళాశాల ఆవరణలో సుమారు 550 మంది ఎన్నికల సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లతో ఈవీఎం, వీవీ ప్యాట్ల పనితీరుపై ఈనెల 9న జరగనున్న శిక్షణా కార్యక్రమ ఏర్పాట్లను ఈఆర్వో, కమిషనర్ జె.వెంకటరావు గురువారం పరిశీలించారు. సిబ్బందికి సూచనలిచ్చారు. డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్,తహశీల్దార్ దొర,డిప్యూటీ తహసీల్దార్ నాయుడు ఉన్నారు.

వర్మకు టీడీపీ టిక్కెట్ ఇవ్వకుంటే రాజీనామాలు

పిఠాపురంలో టీడీపీ నేతల సమావేశం



సమావేశానికి హాజరైన టీడీపీ నాయకులు

పిఠాపురం, మార్చి 7: తెలుగుదేశం-జనసేన పొత్తులో భాగంగా పిఠాపురం సీటును టీడీపీకే కేటాయించి మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు టిక్కెటు ఇవ్వాలని, లేకుంటే సామూహిక రాజీనామాలకు సిద్ధమని టీడీపీ నేతలు ప్రకటించారు. పొత్తులో భాగంగా పిఠాపురం సీటును జనసేనకు కేటాయిస్తారని విస్తృత ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ఆందోళనకు గురైన నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పిఠాపురం పాత టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. పలువురు నాయకులు మాట్లాడుతూ 2 దశాబ్దాలుగా నియోజకవర్గంలో పార్టీ పటిష్టత, అభివృద్ధికి చేసిన కృషి ఎనలేనిదన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వర్మ ఓడినా నిరంతరం ప్రజల్లో ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి, అధికార పార్టీ వేధింపులు నుంచి రక్షించడానికి అండగా నిలబడ్డారని తెలిపారు. పార్టీకి రాత్రింబవళ్లు శ్రమిస్తున్న వర్మకు ఎన్నికలు వచ్చేసరికి టిక్కెట్ విషయంలో మొండిచేయి చూపిస్తున్నారని మండిపడ్డారు. పొత్తులో భాగంగా టీడీపీకే ఇక్కడ సీటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్మకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని, సామూహిక రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. పార్టీ నాయకత్వం నుంచి సానుకూల స్పందన రాకుంటే వర్మను ఇండిపెండెంట్‌గా నిలబెట్టి గెలిపించుకుంటామని తెలిపారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లుమల్లు విజయకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండేపూడి ప్రకాష్, పట్టణ, మండలాధ్యక్షులు రెడ్డెం భాస్కరరావు, సకుమళ్ల గంగాధర్, అనిశెట్టి సత్యానందరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు బర్ల అప్పారావు, మడికి ప్రసాద్, దేవరపల్లి రామారావు, నల్లా శ్రీను, పిల్లి చిన్నా, అల్లవరపు నగేష్ పాల్గొన్నారు.

రాజీనామాలు ప్రకటించడం బాధాకరం : వర్మ

పొత్తులో భాగంగా పిఠాపురం టిక్కెట్టును జనసేనకు కేటాయిస్తున్నారన్న ప్రచారంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆవేదనకు గురై రాజీనామాలు ప్రకటించారని, ఇది బాధాకరమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. చంద్రబాబు తనకు న్యాయం చేస్తారన్న నమ్మకం ఉందని ప్రకటించారు. గురువారం రాత్రి వర్మ మీడియాతో మాట్లాడుతూ మీడియాలో వచ్చిన వార్తలు చూసి తమకు అన్యాయం జరుగుందనే భావనతో నాయకులు, కార్యకర్తలు సమావేశం పెట్టుకుని ఆ బాధలో అలా స్పందించి ఉంటారని అభిప్రాయపడ్డారు. సీటు ఇవ్వకుంటే తనకు బాధగా ఉంటుందని తెలిపారు. చంద్రబాబు అభిమానిగా, క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా ఆయన వెన్నంటే ఉంటానని ప్రకటించారు. వర్మ మీడియాతో మాట్లాడుతున్న సమయంలోనే కొందరు కార్యర్తలు పార్టీ కార్యాలయం బయట టీడీపీ కరపత్రాలు తగులబెట్టారు. వర్మకు టిక్కెట్ ఇవ్వాలని నినాదాలు చేశారు. వర్మ వారిని మందలించారు. ఇటువంటి చర్యలకు పాల్పడటం తగదని, ఇలాంటి చేస్తే తాను పార్టీ కార్యాలయానికి రానని స్పష్టం చేశారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

కోటనందూరు, మార్చి 7: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. గురువారం అల్లిపూడిలో అంకంరెడ్డి గోపి ఆధ్వర్యంలో మీ ఇంటికి మీదివ్య కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ అన్నివర్గాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు, యనమల శివరామకృష్ణన్, రుత్తల శ్రీనివాస్ అంకంరెడ్డిబుల్లిబాబు, రుత్తల నానాజీ, షేక్‌న వాజ్‌జానీ, పోతల సూరిబాబు, వెలగా కృష్ణారావు, డిచీంజీవిరాజు తదితరులున్నారు.

తుని రూరల్: ఎస్.అన్నవరంలో మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమంలో భాగంగా తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యనమల శివరామకృష్ణన్, జనసేన నేత చోడిశెట్టి వెంకటేష్, మోతుకూరి వెంకటేష్, చింతమనీడి నాగ సోమరాజు, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, అప్పన రమేష్, పోలిశెట్టి మార్కండేయులు, వంగలపూడి శ్రీనివాస్ ఉన్నారు.

'బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం'

కాకినాడ సిటీ, మార్చి 7: తెలుగుదేశం-జనసేన పార్టీలు వచ్చే ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసి బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తేనున్నాయని, ఇందుకు సంబంధించి జయహో బీసీ డిక్లరేషన్ సభలో ఇప్పటికే ప్రకటించడం జరిగిందని టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీడీపీ బీసీ సీనియర్ నేత డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీలకు సంబంధించిన విద్యా పథకాలన్నీ పునఃరుద్ధరించడంతో పాటు ఏడాదిలోగా బీసీ భవనాలు, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు పూర్తి చేయనున్నారన్నారు. బీసీల పట్ల వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సరికాదని మండిపడ్డారు. బీసీలంటే బ్యాక్వర్డ్ క్లాస్ కాదని, బ్యాక్ బోన్ క్లాస్ అని వైసీపీ పాలకులు గుర్తుంచుకోవాలని ఆయన చెప్పారు.

'వైసీపీ ప్రభుత్వం అభాసుపాలు'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 7: జనసేనపై కవ్వింపు చర్యలకు పాల్పడితే వైసీపీ ప్రభుత్వమే ప్రజల్లో అభాసుపాలవుతుందని జనసేన పీఏసీ సభ్యుడు, కాకినాడ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ అన్నారు. గురువారం కాకినాడ సిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ జనసేనపార్టీ ప్రధాన కార్యాలయమైన మంగళగిరి ఆఫీసు, స్టాఫ్ క్వార్టర్స్‌కి రాత్రి 12గంటల సమయంలో పోలీసులు వెళ్లి హడావిడిని సృష్టించడం నిద్రపోతున్న వారిని లేపి ఇంటరాగేషన్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో జనసేన నాయకులు తలాటం సత్య, అట్ల సత్యనారాయణ, అడబాల సత్యనారాయణ, శ్రీమన్నారాయణ, మనోహర్‌లాల్‌గుప్తా పాల్గొన్నారు.

'ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలి'

పెద్దాపురం, మార్చి 7: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జె.సీతారామారావు అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)పై నియోజకవర్గస్థాయిలో అధికారులతో ఆయన గురువారం సమీక్షించారు. ఎంసీసీ అమల్లోకి రానున్నందున దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల ప్రశాంతం వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కేవీ.పద్మావతి, ఎంపీడీవో ఉషారాణీ, కార్యాలయ ఏవో సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

'గురుకుల విద్యార్థులకు ఉచిత విద్య'

ప్రత్తిపాడు, మార్చి7: కేంద్రప్రభుత్వం ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసి గిరిజన విద్యార్థులకు ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యనందిస్తుందని జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ చెప్పారు. మండలంలోని పాండవుల పాలెం బాలికల గురుకుల పాఠశాల వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షులు కందా వీరస్వామి, జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షుడు కించు జోగిరాజు, మండల ఉపాధ్యక్షులు జీడిపల్లి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ పనుల పరిశీలన

కరప, మార్చి 7: పెదకొత్తూరులో గ్రామం ఎస్సీ వీధిలో రూ.12.50లక్షలతో చేపడుతున్న కమ్యూనిటీ హాల్, రూ.2.50లక్షలతో నిర్మిస్తున్న ఆర్వో ప్లాంట్ నిర్మాణ పనులను గురువారం ఎంపీడీవో కొంకి అప్పారావు పరిశీలించి గుత్తేదారుడికి తగు సూచనలు జారీ చేశారు. సిబ్బంది వీవీఎస్ వీరేష్, కె.వీరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'మట్టిని తరలించుకుపోతున్నారు'

తాళ్లరేవు, మార్చి 7: పటవల పంచాయతీ పరిధి 216 జాతీయ రహదారి నుంచి పటవల గ్రామంలోకి ఉన్న డ్రైనేజీ పక్కన మట్టిని అధికారపార్టీకి చెందిన వ్యక్తులు తరలించుకుపోతున్నారని పంచాయతీ వార్డు సభ్యులు కాకర్ల మల్లిబాబు, బొరుసు పార్థసారధి గురువారం ఆరోపించారు. పంచాయతీ, అనుమతులు లేకుండా వందలాది ట్రాక్టర్లు మట్టిని ప్రైవేట్ లేఅవుట్‌లకు తరలించుకుపోయి అమ్మేస్తున్నారన్నారు. అలాగే 216 జాతీయర రహదారి పక్కన అనుమతులు లేకుండా పైపులు వేసేందుకు 7అడుగుల లోతున గొయ్యిపెట్టి ఆమట్టిని కూడా తరలించుకుపోయారని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఘనంగా మహిళా దినోత్సవం

జిల్లాలో పలుచోట్ల వేడుకలు

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సత్కారాలు



కాకినాడ సిటీ: మహిళలతో కేక్ కట్ చేస్తున్న కొండబాబు



కార్పొరేషన్: ఉత్తమ మహిళా ఉద్యోగిని సత్కరిస్తున్న దృశ్యం



పిఠాపురం: స్త్రీ ఆకారంలో విద్యార్థినుల మానవహారం

కాకినాడ సిటీ, మార్చి 7: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు మహిళల డిమాండ్ల పట్ల చిత్తశుద్ధి లేదని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు విమర్శించారు. శ్రామిక మహిళలకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని, మహిళలపై అత్యాచారాలను నిరోధించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక కచేరీపేట సుందరయ్యభవన్ వద్ద సీఐటీయూ, ఐద్వా, యూటీఎఫ్ ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏరుబండి చంద్రావతి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ ఐవీ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు చెక్క రమణి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దుర్గాదేవి ప్రసంగించారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, నగర కార్యదర్శి భారతి, పద్మ, రెడ్డి సత్యవతి, మలకా నాగలక్ష్మి, చెక్కల వేణి, రమణమ్మ, జ్యోతి, చామంతి, నాగమణి, దాడి బేబి, రాజేశ్వరి, పాల్గొన్నారు. మహిళలు వివిధ కళారూపాలు ప్రదర్శించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో రాణిస్తున్నారని కాకినాడ మూడవ అడిషనల్ జిల్లా జడ్జి కమలాదేవి పేర్కొన్నారు. కాకినాడ బార్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అడిషనల్ జిల్లా జడ్జి మాట్లాడారు. మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో...

మహిళాభ్యున్నతి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించి పార్టీకి విశేష సేవలందించిన సీనియర్ నాయకురాలు కలగా శివరాణి, మాజీ కార్పొరేటర్లు మల్లిపూడి నాగ సూర్యదీపిక, తుమ్మల సునీత, బంగారు సూర్యావతి, గుజ్జు దుర్గ, అంబటి క్రాంతిలను శాలువాలతో సత్కరించి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. తెలుగు మహిళలు గజమాలతో కొండబాబును సన్మానించారు.

జేఎన్టీయూకే: కాకినాడ జేఎన్టీయూకేలో మహిళలకు పురుషులతో సమానంగా ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నదని ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. వర్శిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ గ్రీవెన్సెస్ డైరెక్టర్ స్వరూపారాణి అధ్యక్షతన నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, గౌరవ అతిథులుగా పాల్గొన్న రెక్టార్ కేవీరమణ, రిజిస్ట్రార్ సుమలత, ఓఎస్డీ కోటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి ప్రారంభించారు. వివిధ పోటీల్లో విజేతలకు వీసీ బహుమతులందజేశారు.

కార్పొరేషన్: కాకినాడ ఆర్టీసీ డిపోలో జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారిణి కె.భారతిసౌజన్య, జిల్లా ట్రాన్స్‌పోర్టు అథారిటీ మెడికల్ ఆఫీసర్ పద్మావతి హాజరయ్యారు. జిల్లా పరిధిలోని 3 డిపోలలో గల ఐదుగురు ఉత్తమ మహిళా ఉద్యోగులు కె.రుక్మిణీదేవి, కె.జయలక్ష్మి, కె.కౌసల్యారాం, వై.సుధారాణి, వి.సత్యవతిని సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. డిపో మేనేజర్ ఎంవివి మనోహర్, ఏలేశ్వరం డిపో మేనేజర్ జీవివి సత్యనారాయణ, కాకినాడ ఆర్టీసీ డిస్పెన్సరీ వైద్యురాలు ఎస్.వీరలక్ష్మి, జిల్లా ప్రధాన రవాణాధికారి కార్యాలయ అసిస్టెంట్ మేనేజర్ మాలిమ్‌బాషా, కాకినాడ, తుని డిపోల అసిస్టెంట్ మేనేజర్లు టి.బాలకృష్ణ, జిజివి రమణ, కాకినాడ స్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాస్, అసోసియేషన్ సభ్యులున్నారు.

కొత్తపల్లి: మూలపేటలో అరబిందో ఫౌండేషన్, వృత్తి విద్యా శిక్షణా కేంద్రం, ప్రతిభా కంప్యూటర్స్‌ల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ఛైర్మన్ కె.నిత్యానందరెడ్డి, డైరెక్టర్ పి. శరత్‌చంద్రారెడ్డి మాట్లాడారు. మహిళల కోసం నిర్వహించిన పెన్సిల్, కాయిన్, మ్యూజికల్ ఛైర్స్, పలు గేమ్స్‌లో రాణించిన విజేతలకు బహుమతులను అందించారు. మహిళలను సత్కరించారు. సచివాలయ వెల్ఫేర్ ఆఫీసర్ సృజన, సచివాలయ సిబ్బంది, సంస్థ ప్రతినిధులున్నారు.

పెద్దాపురం: దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్పీ కె.లతాకుమారి జ్యోతీ ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కళాశాల ఛైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సర్వరామేశ్వరుడు, ఈవో జెన్నిబాబు, ఏసీవో పెదకాపు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సత్యనారాయాణ తదితరులు ఉన్నారు.

తుని రూరల్: తుని మున్సిపల్ కార్యాలయంలో పట్టణ, పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఏలూరు సుధారాణిని సత్కరించారు.

పిఠాపురం: పట్టణంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు వినూత్న రీతిలో శుభాకాంక్షలు తెలిపారు. స్త్రీ ఆకారంలో మానవహారం నిర్మించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.శ్యాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరప: గురజనాపల్లి హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎ.సాయిమోహన్ మాట్లాడారు. మహిళా ఉపాధ్యాయులు పి.మాణిక్యాంబ, ఎం.ప్రభారాణి, పి.భవానీ, సీహెచ్.పద్మావతి, కె.లక్ష్మి, డి.వరలక్ష్మిలను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, వీవీ రమణమూర్తి, టి.వేణుగోపాల్, ఎ.సూర్యనారాయణ, వి.శోభాకర్, తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నారీశక్తి ఫిట్నెస్ రన్ నిర్వహించారు. మహిళా అధ్యాపకులను సన్మానించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్, వైస్ ప్రిన్సిపాల్ దివాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాము సిద్దార్థబాబు పాల్గొన్నారు.

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విద్యాప్రాంగణంలో మహిళా సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ డోలా సంజయ్, డాక్టర్ రమేష్, డాక్టర్ కె.రవిశంకర్, డాక్టర్ డి.సతీష్‌కుమార్, సంజయ్‌కుమార్ ఉన్నారు.

డీఐజీ, ఎస్పీ ప్రత్యేక పూజలు



ఆశీస్సులు అందుకుంటున్న డీఐజీ, ఎస్పీ

సామర్లకోట, మార్చి 7: సామర్లకోట కుమార రామ భీమే శ్వరాలయంలో గురువారం సాయంత్రం ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమేశ్వరస్వామికి అభిషేకాలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు చేశారు. వారికి ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సాదరంగా స్వాగతం పలికారు. నంది మండపం వద్ద ఆలయ పండితులతో వేదస్వస్తి పలికి ప్రసాదాలు అందజేశారు. వారి వెంట పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, సామర్లకోట ఎస్‌హెచ్‌వో సురేష్ తదితర పోలీసులున్నారు.

రామలింగేశ్వరస్వామి కల్యాణం



దుర్గాడలో రామలింగేశ్వరస్వామి కల్యాణ దృశ్యం

గొల్లప్రోలు రూరల్, మార్చి 7: మండలంలోని దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణం కన్నులపండువగా జరిగింది. స్వామి, అమ్మవార్లను అలంకరించి ప్రత్యేకంగా వేదికపై ఉంచి కల్యాణం జరిపించారు. మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధధారణ, భేరిపూజ, కన్యాదానం, సుముహూర్తం, తలంబ్రాలుతో కల్యాణోత్సవం జరిగింది. తిలకించేందుకు భక్తులు భారీగా తరలిరాగా ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కుక్కుటేశుని గ్రామోత్సవం

పిఠాపురం, మార్చి 7: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి,అమ్మవార్లకు అభిషేకం,కుంకుమార్చన నిర్వహించారు. కల్యాణం అనంతరం నిర్వహించే ప్రధాన ప్రవేశ తాళిపాక శేషహోమాన్ని జరిపించారు. రాజరాజేశ్వరీదేవికి సహస్ర చామంతి పూజ జరిగింది. ఈవో పులి నారాయణమూర్తి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'అభివృద్ధి పనులను పూర్తి చేయాలి'

పెద్దాపురం, మార్చి 7: పట్టణంలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు మందిరంలో గురువారం నిర్వహించిన కౌన్సిల్ అత్యవసర సమావేశానికి వారు హాజరయ్యారు. పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి 20 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ మేనేజర్ జ్యోతీరాణీ, డీఈ ఆదినారాయణ, శానిటరీ ఇనస్పెక్టర్ దావీదురాజు, ఆర్వో చంద్రశేఖర్, కౌన్సిలర్లు అరెళ్ల వీర్రాఘవరావు, విజ్జపు రాజశేఖర్, పప్పల దురాగరావు, విడదాసరి రాజా, వాసంశెట్టి గంగ, ఆకుల కృష్ణబాపూజీ ఉన్నారు.

ఇగ్నో స్టడీసెంటర్ సందర్శన

కాకినాడ రూరల్, మార్చి 7: విశాఖపట్నంలోని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ సిక్రిష్ణారావు విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ పీజీ కళాశాలలో గల ఇగ్నో స్టడీసెంటర్‌ను సందర్శించి అడ్మిషన్లపై సమీక్షించినట్టు ప్రిన్సిపాల్, స్టడీసెంటర్ సమన్వయకర్త డాక్టర్ తలాటం సత్యనారాయణ తెలిపారు. జనవరి 2024 సెషన్‌కు సంబంధించి ఐడియల్ కళాశాల, పీఆర్ కళాశాల, సంజీవి కళాశాలల్లో ఇగ్నో అందిస్తున్న కోర్సులపై అవగాహన కల్పించారన్నారు. సహాయ సమన్వయకర్త బి.శ్రీనివాస్, సిబ్బంది కృష్ణ, రమణ, మచ్చిబాబు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రజలు టీడీపీని గెలిపించాలి

ప్రత్తిపాడు ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ



ప్రత్తిపాడులో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, మార్చి 7: నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలు టీడీపీని గెలిపించాలని ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా కోరారు. టీడీపీ కార్యాలయం వద్ద గురువారం సిరిపురం గ్రామానికి చెందిన 50 దళిత కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి సత్యప్రభ సమక్షంలో టీడీపీలోకి చేరారు. సత్యప్రభ మాట్లాడుతూ వైసీపీ పాలనలో నియోజకవర్గం అన్ని విధాలా దోపిడీకి గురై అభివృద్ధికి వెనుకబడి పోయిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రజలు ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీలో చేరినవారిలో అడ్డాల దేవుడు, పలివెల బాబి, పి.ప్రసన్న, గొడతా విజయ్‌కుమార్, పెదపాటి రాజబాబు, పెట్ల లోవబాబు, పలివెల సోమరాజు, అడ్డాల నాగేంద్ర, కాకాడ బుజ్జమ్మ ఉండగా నాయకులు బచ్చల నాగ శివ, జార్జి పాల్గొన్నారు.

'గుణపాఠం చెప్పేందుకు సిద్ధం'

తొండంగి, మార్చి 7: రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌ని నమ్మేస్థితిలో లేరని, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు తెలిపారు. తొండంగికి చెందిన పక్కుర్తి భవాని, నాగసత్యన్నారాయణ తదితరులు కృష్ణుడు సమక్షంలో టీడీపీలోలో చేరారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పేకేటి హరికృష్ణ, మత్స్యకార జిల్లా అధ్యక్షుడు కోడ వెంకటరమణ, మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, ప్రధాన కార్యదర్శి మురాలశెట్టి సత్యన్నారాయణ, బంటుపల్లి అన్వేష్, నేమాల కృష్ణ, దూలం మురళి, జనసేన నేత బి.నాయుడు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఏలేశ్వరం ఘాట్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్, ఎస్ఐ

ఏలేశ్వరం, మార్చి 7: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏలేశ్వరం, సిరిపురం, లింగంపర్తిలో ఏర్పాటు పూర్తయ్యాయి. ఏలేశ్వరం శ్రీరాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయానికి ఏజెన్సీ పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్న దృష్ట్యా ప్రజాప్రతినిధులు, అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఏలేరు నదీతీరాన బ్రాహ్మణరేవు స్నానఘాట్‌ల వద్ద మహిళల కోసం ప్రత్యేక గుడారాలు, విద్యుత్ దీపాలు, బారికేడ్ల నిర్మాణంతో క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ఏలేశ్వరం నగర పంచాయితీ కమిషనర్ శివకుమార్, ఎస్ఐ జి.సతీష్ ఘాట్‌ల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఏలేరు నదిపై వంతెన కుంగిపోవడంతో జగ్గంపేట, ఏలేశ్వరం నుంచి వచ్చే భక్తుల రాకపోకలు వీలుగా నీటిలో కర్రలతో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఆలయాలువిద్యుత్‌కాంతులతో వెలుగుతున్నాయి.

గండేపల్లి: మండలంలో గండేపల్లి, మల్లేపల్లి, ఉప్పలపాడు, నీలాద్రిరావుపేట, తాళ్ళూరు గ్రామాల్లో శివాలయాలను మామిడితోరణాలు, విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేశారు.

ప్రత్తిపాడు: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని ఎరకంపాలెం, ధారపల్లి, తోటపల్లిలోని శివలింగాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేశారు. రాచపల్లిలోని అరుణాచలేశ్వర స్వామి ఆలయం వద్ద పుష్కరిణిలో స్నానాలచరించేందుకు ఏర్పాట్లు చేశారు. ధర్మవరం, ఒమ్మంగి, గజ్జెనపూడి శివాలయాల వద్ద ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రత్తిపాడులో విశ్వేశ్వరస్వామి కల్యాణం ఘనంగా చేపట్టారు.

మాంసం దుకాణాలపై అధికారుల దాడులు

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 7: ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని 14వ సర్కిల్ పరిధిలోని కొత్తపేట మార్కెట్‌లో నిల్వ ఉంచిన మేక తలకాయలు, కాళ్లు, మాంసం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ తన సిబ్బందితో దాడి చేశారు. నిల్వ ఉంచిన మాంసాన్ని స్వాధీనం చేసుకుని బ్లీచింగ్ పోసి ధ్వంసం చేశారు. శానిటరీ సూపర్‌వైజర్ జిలానీకి సమాచారం ఇవ్వడంతో మార్కెట్‌కి వచ్చి పరిశీలించారు. విక్రయిస్తున్న మహిళకు అపరాధ రుసుము విధించారు. కుళ్లిపోయిన మాంసం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

సర్పవరం జంక్షన్, మార్చి 7: కాకినాడ రూరల్ తిమ్మాపురంలో గురువారం గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో సుమారు కోటి నిధులతో నిర్మించిన అంబేడ్కర్ భవనం, ఆర్‌బీకే, సచివాలయం భవనాలను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రారంభించారు. మారుతీనగర్, రేపాక గార్డెన్స్‌లో సుమారు రూ.1.70 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 2 ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. ప్రజ్ఞ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో 719 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్, వైస్ ఎంపీపీ బిందిలి వీరీష, ఎంపీటీసీ ముద్దన వెంకట్రావు, కురసాల సత్యనారాయణ, విలియమ్స్, రాందేవు చిన్న, కర్రి చక్రధర్, రాజు పాల్గొన్నారు.

పైపులైన్లు తొలగించాలని నిరసన

కొత్తపల్లి, మార్చి 7: కలుషిత రసాయనిక వ్యర్థజలాలు సముద్రంలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్లు తొలగించాలని కోరుతూ గురువారం మండలంలో కోనపాపపేట ప్రధాన రోడ్డులో ఆందోళన నిర్వహించిన మత్స్యకారులు వంటా వార్పుతో నిరసన తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోనపాపపేటతో సహా తొండంగి మండలంలో నిర్మిస్తున్న పైపులైన్లు తొలగించకపోతే ఉద్యమాన్ని తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్



నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, మార్చి 7: న్యాయం కోసం పోలీస్‌స్టేషన్లకు వచ్చే వారికి నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలందించి పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆకాంక్షించారు. గురువారం తిమ్మాపురంలో రూ.60లక్షల ఎస్ఆర్ఎంటీ సీఎస్ఆర్ నిధులతో నూతనంగా నిర్మించిన తిమ్మాపురం పోలీస్‌స్టేషన్ భవనాన్ని కాకినాడ ఎంపీ వంగా గీత, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, పోలీసుల సౌకర్యార్థం అన్ని వసతులతో భవనం నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, జడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఏఎస్పీ ఎంవీజే భాస్కరరావు, ఏఎస్పీ రిజర్వు బి.సత్యనారాయణ, అదనపు ఎస్పీ ఎస్ఈబీ శ్రీలక్ష్మి, ఎస్డీపీవో హనుమంతరావు, రూరల్ సర్కిల్ సీఐ కె.శ్రీనివాస్, తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు తదితరులున్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం



టీడీపీ కార్యాలయం ప్రారంభిస్తున్న యనమల

కోటనందూరు, మార్చి 7: కోటనందూరు మార్కెట్ సమీపంలో టీడీపీ కార్యాలయాన్ని బుధవారం పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ప్రారంభించారు. తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు, మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు, డి.చిరంజీవిరాజు, వెలగా వెంకట గంగాదర రంగనాయకులు, వెలగా కృష్ణారావు, చింతకాయల రవికుమార్, లగుడు సత్యనారాయణమూర్తి,పంపనబోయిన దొంగబాబు ఉన్నారు.

'వైసీపీకి దగ్గరపడ్డ రోజులు'

తాళ్లరేవు, మార్చి 7: వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడుతున్నాయని, ప్రజలు తగిన బుద్ధి చెబుతారని చొల్లంగిలో ఇళ్ల స్థలాల కోసం నిరసన తెలుపుతున్నావారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం 37రోజు నిరసనలో మేడపాటి వేవానందం, పులకూర చిన్నబాబు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం పేదలు నిరసన చేస్తుంటే ప్రభుత్వ అధికారులు, ప్రతినిధులెవ్వరు స్పందించకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు.